
# ఆకాశానికి నిచ్చెన!

- భూమిపై నుంచి అంతరిక్షానికి ఎలివేటర్
- 36,000 కిలోమీటర్ల ఎత్తు నుంచి కేబుళ్లు
- రాకెట్ల అవసరం లేకుండానే స్పేస్‌కు
- పేలోడ్లు తీసుకెళ్లొచ్చు.. మానవులూ వెళ్లొచ్చు
- భవిష్యత్తులో వాస్తవ రూపం దాల్చే అవకాశం



ఢిల్లీ, మార్చి 16: చందమామ కథలో చదివినట్టు రెక్కల గుర్రం వేసుకొని ఆకాశంలో ఎగరాలని ఉందా? పక్షుల్లా రెక్కలు కట్టుకొని నింగిలో విహరించాలని కలలు కంటున్నారా? ఆకాశానికి నిచ్చెన వేసి నక్షత్రాలను లెక్కపెట్టాలని అనుకుంటున్నారా? చందమామ కథల్లో లాగా రెక్కల గుర్రం, పక్షుల్లా రెక్కలంటే సాధ్యపడకపోవచ్చు గానీ, ఆకాశానికి నిచ్చెన వేసే రోజులు దగ్గర్లోనే ఉన్నాయి. ఎంచెక్కా కేబుళ్ల సాయంతో ఎలివేటరో, లిఫ్టో ఎక్కి చందమామను దగ్గర్నుంచి వీక్షించే గడియలు రాబోయే దశాబ్దాల్లో మనం చూసినా ఆశ్చర్యపోనక్కర్లేదు. సైన్స్ ఫిక్షన్ సినిమాల్లో మాత్రమే జరిగే ఈ అసాధ్యాన్ని సుసాధ్యం చేయడం కష్టమేమీ కాదని శాస్త్రవేత్తలు ఆశాభావం వ్యక్తంచేస్తున్నారు.

**రష్యన్ శాస్త్రవేత్త కల సాధ్యపడేనా?**

స్పేస్ ఎలివేటర్ ఆలోచన ఇప్పటిది కాదు. 1895లో రష్యన్ శాస్త్రవేత్త కాన్‌స్టెంటిన్ సియోల్కోవ్‌స్కీ ఇలాగే కలలు గన్నారు. భూమిపై నుంచి 36 వేల కిలోమీటర్ల ఎత్తులో భూ స్థిర కక్ష్యలో ఉండే ఓ ఉపగ్రహం అతి భారీ కేబుల్‌ను స్థిరంగా పట్టుకొని ఉంచుతుంది. ఇది ఎల్లప్పుడూ ఒకే ప్రదేశంలో, అంటే భూమధ్య రేఖ వద్ద తిరుగుతుంది. అంతరిక్షం నుంచి ఒక కేబుల్ భూమికి వేలాడుతూ ఉంటుంది. గురుత్వాకర్షణ శక్తి, సెంట్రిప్యూయల్ ఫోర్స్ దీన్ని పడిపోకుండా స్థిరంగా ఉంచుతాయి. సముద్రంలో నౌక లంగరు వేసినట్టే.. ఈ కేబుల్ భూమిపై పర్వతం లేదా టవర్ లేదా సముద్రంలో మొబైల్ టవర్‌కు లంగర్ వేసి ఉంటుంది. విద్యుత్తు సాయంతో ఎలివేటర్ లేదా లిఫ్ట్‌లో వెళ్లినట్టు వ్యోమగాములు ఆ కేబుల్‌ను అధిరోహిస్తారు. ఉపగ్రహాలు, ఇతర సామగ్రి, మానవులను కూడా అంతరిక్షంలోకి తీసుకెళ్తారు. రాకెట్ అవసరం లేకుండా, అతి తక్కువ ఖర్చుతో ఎలాంటి కాలుష్యం లేకుండా ఇది పని చేస్తుంది. అలా వెళ్లాలంటే ఆ కేబుల్ కచ్చితంగా స్టీల్ కంటే 50 రెట్లు దృఢంగా ఉండాలి. అందుకు కార్బన్ నానోట్యూబ్స్ లేదా గ్రాఫీన్ లాంటి పదార్థాలు అవసరం. కేబుల్ నిర్మాణం పడిపోతుందని భయపడాల్సిన అవసరమే లేదు. ఎందుకంటే, కేబుల్ ద్రవ్యరాశిలో 1 శాతం బరువున్న పేలోడ్లను ఎలాంటి ఇబ్బంది లేకుండా పైకి చేర్చవచ్చని నిపుణులు చెబుతున్నారు. ఈ స్పేస్ ఎలివేటర్ కల గనుక ఆచరణలోకి వస్తే అంతరిక్ష యాత్రలు సర్వసాధారణం అయిపోతాయి. అంతరిక్ష పరిశోధనల్లో పురోగతి, రోజురోజుకు వస్తున్న టెక్నాలజీ దృష్ట్యా రాబోయే దశాబ్దాల్లో ఇది సాకారం కావొచ్చని శాస్త్రవేత్తలు చెప్తున్నారు.



## చంద్రయాన్-5కి కేంద్రం గ్రీన్‌సిగ్నల్

**ఇస్రో చీఫ్ నారాయణన్ వెల్లడి**

చెన్నై: చంద్రయాన్-5 మిషన్‌కు కేంద్రం ఇటీవల ఆమోదం తెలిపిందని ఇస్రో చైర్మన్ వీ నారాయణన్ ఆదివారం వెల్లడించారు. చంద్రుడిపై అధ్యయనానికి చంద్రయాన్ 3లో 25 కిలోల రోవర్‌ను పంపించగా, చంద్రయాన్-5లో 250 కిలోల రోవర్‌ను పంపించనున్నట్టు ఆయన తెలిపారు. చంద్రయాన్-3 మిషన్‌లో భాగంగా 2023 ఆగస్టు 23న చంద్రుడి దక్షిణ ధ్రువంపై విక్రమ్ ల్యాండర్ విజయవంతంగా దిగిన విషయం తెలిసిందే. మూడు రోజుల కిందటే చంద్రయాన్-5కి కేంద్రం నుంచి ఆమోదం లభించిందని, జపాన్ సహకారంతో ఈ ప్రయోగం నిర్వహించనున్నట్టు నారాయణన్ చెప్పారు. చంద్రుడి నమూనాలు తీసుకొని వచ్చేందుకు 2027లో చంద్రయాన్-4ను ప్రయోగించనున్నట్టు వెల్లడించారు.



## అమెరికాను వణికిస్తున్న టోర్నడోలు

**35 మంది మృతి**

వాషింగ్టన్: మధ్య, దక్షిణ అమెరికాలలో పెను తుఫానులు, కార్చిచ్చులు బీభత్సం సృష్టిస్తున్నాయి. దీంతో ఇండ్లు, పాఠశాలలకు తీవ్ర నష్టం జరిగింది. వివిధ రాష్ట్రాల్లో మొత్తంగా 35 మంది ప్రాణాలు కోల్పోయారు. మిస్సోరీలో శుక్రవారం రాత్రి కనీసం 12 మంది మరణించినట్లు అధికారులు తెలిపారు. మిసిసిప్పిలో ఆరుగురు మరణించినట్లు గవర్నర్ టటే రీవ్స్ తెలిపారు. అలబామాలో ఇండ్లు, రోడ్లు దెబ్బతిన్నాయి. అర్కాన్సాస్‌లో ముగ్గురు మరణించారు. గవర్నర్ సారా హుక్కబీ శాండర్స్ అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. జార్జియా గవర్నర్ కూడా ఎమర్జెన్సీని ప్రకటించారు. పొడిగా ఉండే ప్రాంతాల్లో కార్చిచ్చులు సంభవించే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. దేశంలో 130 అగ్ని ప్రమాద ఘటనలు జరిగినట్లు సమాచారం.

## సుదీక్ష కేసు.. బీచ్‌లో దుస్తులు లభ్యం

న్యూఢిల్లీ: స్నేహితులతో కలిసి కరీబియన్ దీవుల్లో విహారయాత్రకు వెళ్లి అదృశ్యమైన భారత సంతతి విద్యార్థిని సుదీక్ష కోణంకి కేసు దర్యాప్తు అధికారులకు అంతు చిక్కటం లేదు. ఆమెకు చెందినవిగా భావిస్తున్న దుస్తులు ఇక్కడి బీచ్‌లోని లాంజ్ కుర్చీ వద్ద కనిపించాయని, వారం క్రితం అక్కడే ఆమె కనిపించకుండా పోయారని న్యూయార్క్ పోస్ట్ కథనం తాజాగా తెలిపింది. నిఘా కెమెరాల్లో చివరిసారి ఆమెతో కనిపించిన (మార్చి 6న) జోష్ రీబ్ అనే అతన్ని అధికారులు విచారిస్తున్నారు. సుదీక్ష కోణంకి సముద్రంలో మునిగిపోయి ఉంటుందని అధికారులు అనుమానిస్తున్నారు.

# భూమిపైకి తిరిగొచ్చాక నడవడమూ కష్టమే!

- వ్యోమగాములపై జీరో గ్రావిటీ ఎఫెక్ట్
- స్పేస్ సిక్‌నెస్‌తో తప్పని ఇబ్బందులు
- తల తిరగడం, చూపు మందగించే అవకాశం

న్యూయార్క్, మార్చి 16: అంతరిక్షంలోని ఐఎస్ఎస్‌లో వ్యోమగాములు తేలియాడుతుండటం చూడటానికి మనకు సరదాగా ఉండవచ్చు. కానీ, సుదీర్ఘ కాలం అంతరిక్షంలో ఉండే వ్యోమగాములపై జీరో గ్రావిటీ తీవ్ర ప్రభావం చూపుతుంది. భూమిపైకి తిరిగొచ్చాక తల తిరగడం, వికారం, నడవలేకపోవడం లాంటి అనేక ఇబ్బందులు వారిని చుట్టుముడతాయి. నాసా వ్యోమగాములు సునీతా విలియమ్స్, బచ్ విల్మోర్ స్పేస్ ఎక్స్‌కు చెందిన డ్రాగన్ స్పేస్‌క్రాఫ్ట్‌లో బుధవారం భూమిపైకి తిరిగిరానున్నారు. 8 రోజుల అంతరిక్ష యాత్ర కోసం ఐఎస్ఎస్‌కు వెళ్లిన విలియమ్స్, విల్మోర్ సాంకేతిక కారణాల వల్ల 9 నెలల పాటు అక్కడే ఉండాల్సిన పరిస్థితి తలెత్తిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో గతంలో పలు మిషన్ల కోసం అంతరిక్షంలో ట్రావెల్ చేసిన ఆస్ట్రోనాట్స్ తాము ఎదుర్కొన్న ఇబ్బందులను వెల్లడించారు. నడవలేకపోవడం, చూపు మందగించడం, తల తిరగడం, బేబీ ఫీట్ (అరికాళ్లతోపాటు ఇతర మందపాటి చర్మం సన్నగా, చిన్న పిల్లల చర్మం వలె మారిపోవడం) లాంటి ఇబ్బందులను ఎదుర్కొన్నట్టు తెలిపారు. 'వ్యోమగాములు భూమిపైకి చేరుకున్నాక గురుత్వాకర్షణ శక్తికి సర్దుబాటు చేసుకోవాల్సి ఉంటుంది. వారి శ్రేయస్సు దృష్ట్యా మొదట కుర్చీలో కూర్చొబెడతారు' అని హ్యూస్టన్‌లోని బేలర్ కాలేజ్ ఆఫ్ మెడిసిన్ పేర్కొంది.

**కొన్ని వారాల సమయం**

ఇబ్బందుల నుంచి బయటపడేందుకు వ్యోమగాములకు ఒక్కోసారి కొన్ని వారాల సమయం పట్టవచ్చు. చెవి లోపల ఉండే వెస్టిబ్యులర్ అనే అవయవం మనం నడిచేటప్పుడు బాడీ బ్యాలెన్స్‌గా ఉండేందుకు సహాయపడుతుంది. జీరో గ్రావిటీలో దీని పనితనం మారిపోతుంది. భూమిపైకి తిరిగొచ్చాక స్పేస్ సిక్‌నెస్ కారణంగా ఇది మెదడును గందరగోళానికి గురిచేస్తుందని జపాన్ స్పేస్ ఏజెన్సీ జాక్సా తెలిపింది.

**ఎముకల సాంద్రత కూడా కోల్పోతారు**

జీరో గ్రావిటీలో ఉన్నప్పుడు రక్తం సహా ఇతర ద్రవాలన్నీ శరీరం పైభాగంలో ఉండిపోయి ఉబ్బినట్టు కనిపించేలా చేస్తాయి. ప్రతి నెల ఒక శాతం ఎముకల సాంద్రతను కోల్పోతారు. దీని నుంచి బయటపడి నడవాలంటే ట్రెడ్‌మిల్ సాయంతో వ్యాయామాలు చేయాల్సి ఉంటుంది. రోగ నిరోధక వ్యవస్థ కూడా తన కర్తవ్యాన్ని మరిచిపోతుందని, అయితే ఇప్పటివరకు ఎలాంటి ఇన్ఫెక్షన్‌ను వ్యోమగాములు ఎదుర్కొనలేదని యూరోపియన్ ఏజెన్సీకి చెందిన సెర్జి వెల్లడించారు.



### మరో రెండు రోజుల్లో భూమ్మీదకు సునీతా

వాషింగ్టన్: ఎంతోకాలంగా వాయిదా పడుతూ వస్తున్న నాసా వ్యోమగాములు సునీతా విలియమ్స్, విల్మోర్‌ల తిరుగు ప్రయాణం ఎట్టకేలకు ఖరారైంది. గత 9 నెలలుగా ఐఎస్ఎస్‌లో చిక్కుకుపోయిన వీరిద్దరి తిరుగు ప్రయాణం బుధవారం ఖరారైనట్టు తెలిసింది. ఐఎస్ఎస్‌కు చేరుకున్న స్పేస్‌ఎక్స్ డ్రాగన్ స్పేస్‌క్రాఫ్ట్, అనుసంధానం (డాకింగ్) ప్రక్రియను ఆదివారం ఉదయం విజయవంతంగా పూర్తి చేసినట్టు 'నాసా' వెల్లడించింది. కొత్త వ్యోమగాములకు ఐఎస్ఎస్ వ్యోమగాములు స్వాగతం పలికారు.

**రోదసిలో 9 నెలలున్నా దక్కేది కోటి వరకే!**

నాసా వ్యోమగాములు సునీతా విలియమ్స్, విల్‌మోర్ అనుకోని సాంకేతిక కారణాల వల్ల తొమ్మిది నెలల పాటు ఐఎస్ఎస్‌లో చిక్కుకుపోవాల్సి వచ్చింది. ఈ నేపథ్యంలో అంతరిక్షంలో అన్ని రోజులు ఉన్నందుకు వారికి లభించే జీతభత్యాలపై చర్చ నడుస్తున్నది. విశ్రాంత నాసా వ్యోమగామి కోల్‌మాన్ ప్రకారం వ్యోమగాముల ప్రత్యేక అదనపు పని సమయానికి జీతం ఉండదు. వ్యోమగాములు ఫెడరల్ ఉద్యోగులు కావడంతో వాళ్లు అంతరిక్షంలో ఉన్నా వారికి రెగ్యులర్ జీతాలనే చెల్లిస్తారు. ఇందులో ఐఎస్ఎస్‌లో వ్యోమగాముల ఆహార, నివాస ఖర్చులు కలిపి ఉంటాయి. అయితే రోదసిలో వారికి జరిగే అనుకోని ఘటనలకు గాను రోజుకు రూ.347(4 డాలర్లు) స్టైఫండ్‌గా చెల్లిస్తారు. వ్యోమగాములు జీ-15 ప్రభుత్వ ఉద్యోగుల విభాగం కింద వార్షిక జీతం రూ.81 లక్షల నుంచి రూ.1.41 కోట్లు పొందుతారు. ఐఎస్ఎస్‌లో అదనంగా ఉన్నందుకు సునీత, విల్‌మోర్ సుమారు రూ.81 లక్షల నుంచి రూ.1.05 కోట్ల జీతం పొందవచ్చు.

## డిజిటల్ అరెస్ట్ మోసాలు.. 2024లో 2 వేల కోట్లు స్వాహా

న్యూఢిల్లీ: డిజిటల్ అరెస్ట్ పేరుతో సైబర్ నేరగాళ్లు పాల్పడుతున్న మోసాలు, కుంభకోణాలకు అంతు లేకుండా పోతున్నది. ఒక్క 2024 ఏడాదిలో భారతీయులు సుమారుగా రూ.2 వేల కోట్లు నష్టపోయారని 'నేషనల్ సైబర్‌క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్' (ఎన్‌సీఆర్‌పీ) నివేదిక పేర్కొన్నది. 2025లో మొదటి రెండు నెలల్లో 17,718 కేసులు నమోదు కాగా, బాధితుల నుంచి సైబర్ నేరగాళ్లు రూ.210 కోట్లు కొల్లగొట్టారని తెలిసింది. డిజిటల్ అరెస్టు స్కామ్ కేసులు.. గత మూడేండ్లలో భారీగా పెరిగాయని తాజా గణాంకాలు చెబుతున్నాయి. కేసుల సంఖ్య మూడు రెట్లు, బాధితులు కోల్పోయిన సొమ్ము 20 రెట్లు పెరిగిందని గణాంకాలు వెల్లడించాయి.

## ఐదేండ్లలో 400 కోట్ల పన్ను చెల్లించాం

**అయోధ్య రామమందిర ట్రస్ట్**

అయోధ్య: గత ఐదేండ్లలో ప్రభుత్వానికి రూ.400 కోట్లకుపైగా పన్ను చెల్లించినట్టు శ్రీరామజన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ వెల్లడించింది. ట్రస్ట్ కార్యదర్శి చంపత్ రాయ్ ఆదివారం మాట్లాడుతూ, 2020 నుంచి 2025 ఫిబ్రవరి 5 వరకు జీఎస్టీ కింద రూ.270 కోట్లు, ఇతర పన్ను క్యాటగిరీల కింద రూ.130 కోట్లు చెల్లించినట్లు తెలిపారు. అయోధ్య రామాలయం ప్రధాన మతపరమైన పర్యాటక కేంద్రంగా మారిందన్నారు. భక్తులు, పర్యాటకుల సంఖ్య 10 రెట్లు పెరిగిందని చెప్పారు. స్థానికులకు ఉపాధి అవకాశాలు పెరిగాయన్నారు. మహా కుంభ మేళా సందర్భంగా 1.26 కోట్ల మంది బాలక్ రామ్‌ను దర్శనం చేసుకున్నారని తెలిపారు. నిరుడు అయోధ్యకు 16 కోట్ల మంది వచ్చారని, 5 కోట్ల మంది రామాలయాన్ని సందర్శించారని వివరించారు. ట్రస్ట్ ఆర్థిక రికార్డులను కాగ్ ఆడిట్ చేస్తుందన్నారు.



## కులం గురించి మాట్లాడితే సహించను: గడ్కరీ

నాగ్‌పూర్: కుల రాజకీయాలను తాను బలంగా వ్యతిరేకిస్తానని కేంద్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ స్పష్టంచేశారు. ఓ వ్యక్తి విలువను అతడి అర్హతలు నిర్ణయిస్తాయి కాని, అతడి కులం, మతం, భాష, లింగం నిర్ధారించవని చెప్పారు. శనివారం నాగ్‌పూర్‌లో జరిగిన సెంట్రల్ ఇండియా గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ స్నాతకోత్సవంలో ఆయన విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. తనకు ఓట్లు కురిపించినా, కుల రాజకీయాలు చేయనని చెప్పారు. ఈ సందర్భంగా 2024లో జరిగిన ఓ సభను గుర్తు చేసుకొంటూ కులం గురించి మాట్లాడే వారిని తరిమికొడతానని ఆనాడు తాను అన్నానన్నారు. తాను రాజకీయాల్లో ఉన్నానని, తనను కుల నేతలు కలుస్తుంటారని చెప్పారు. 'కానీ, నేను నా దారిలోనే నడుస్తా. నాకు ఓట్లు పడచ్చు. పడకపోవచ్చు' అని పేర్కొన్నారు.

## శాంతికి యత్నిస్తే ద్రోహమే ఎదురైంది!

- పాక్‌తో సంబంధాలపై మోదీ
- ఆర్‌ఎస్‌ఎస్ నుంచి నేను జీవిత విలువలు నేర్చుకున్నా
- తప్పుడు కథనాలతో గోద్రా కేసులో ఇరికించాలనుకున్నారు
- లెక్స్ ఫ్రిడ్‌మ్యాన్‌తో పాడ్‌కాస్ట్‌లో కీలక వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, మార్చి 16: పాకిస్థాన్‌తో శాంతిని నెలకొల్పడానికి భారత్ ప్రయత్నం చేసినప్పుడల్లా శత్రుత్వం, ద్రోహమే ఎదురైందని ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారు. అమెరికాకు చెందిన లెక్స్ ఫ్రిడ్‌మ్యాన్‌తో జరిగిన పాడ్‌కాస్ట్‌లో ఆయన మాట్లాడుతూ ఇరుదేశాల మధ్య శాంతి నెలకొనాలన్న ఆశతోనే తొలిసారిగా 2014లో తన ప్రమాణ స్వీకారోత్సవానికి అప్పటి ప్రధాని నవాజ్ షరీఫ్‌ను ఆహ్వానించినట్టు ఆయన చెప్పారు. ఆ దేశంలో జరుగుతున్న ఉగ్రవాద కార్యకలాపాలు, అశాంతి పరిస్థితులకు ఎంతోమంది అమాయకులు సమిధలవుతున్నారన్నారు. వాటితో ఆ దేశ ప్రజలు కూడా విసుగు చెందారన్నారు. శాంతి, సామరస్యాలే తమ విదేశాంగ విధానమని ఇప్పటికే పలు అంతర్జాతీయ వేదికలలో భారత్ తన వైఖరి స్పష్టం చేసిందని ప్రధాని మోదీ తెలిపారు. ఇరు దేశాల మధ్య సంబంధాలు మెరుగుపర్చుకునే బాధ్యత పాక్‌పైనే ఉందని అన్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు, తనకు మధ్య పరస్పర విశ్వాసం ఉందని, అన్నింటికంటే జాతీయ ప్రయోజనాలే ముఖ్యమని తాము భావిస్తామని, అదే తమను బాగా కనెక్ట్ చేసిందని చెప్పారు.

**తప్పుడు కథనాలతో ఇరికించాలనుకున్నారు**

2002లో గుజరాత్‌లో గోద్రా అల్లర్ల అనంతరం అప్పట్లో కేంద్రంలో ఉన్న ప్రత్యర్థి పార్టీలు తప్పుడు కథనాల ద్వారా తనను శిక్షించాలని ప్రయత్నించాయని, కానీ కోర్టులు తనకు విముక్తి కల్పించాయని అన్నారు. ఆర్ఎస్ఎస్ నుంచి జీవిత విలువలు నేర్చుకోవడం అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు. ఇంత పవిత్రమైన సంస్థలో తానూ భాగస్వామి అయినందుకు అదృష్టవంతుడినని అన్నారు. ఇప్పుడు ప్రపంచంలో విస్తృతంగా ప్రచారం పొందుతున్న కృత్రిమ మేధ సాంకేతికత గురించి ప్రధాని మోదీ ప్రస్తావిస్తూ ఇది చాలా శక్తివంతమైనదని అన్నారు. అయితే అది మానవ మేధస్సు ఊహల లోతుకు ఎప్పటికీ సరిపోలకపోవచ్చునని అన్నారు

**యుద్ధంతో పరిష్కారం రాదు**

ప్రస్తుత రష్యా-ఉక్రెయిన్ సంక్షోభానికి యుద్ధం ద్వారా ఎన్నడూ పరిష్కారం లభించదని, ఇరు వర్గాలు చర్చలకు కూర్చున్నప్పుడు అది సమసిపోతుందని అన్నారు. తనకు రెండు దేశాల అధ్యక్షులతో మంచి సంబంధాలు ఉన్నాయన్నారు. చైనా దేశంతో మనకు ఉద్రిక్తతలు ఉన్నప్పటికీ చర్చలకే తాను ప్రాధాన్యం ఇస్తానని చెప్పారు. ఇరు దేశాలు ఆరోగ్యకరమైన పోటీతత్వంతో ముందుకు సాగాలని కోరుకుంటున్నానని ప్రధాన మోదీ ఆకాంక్షించారు.

## యెమెన్‌పై అమెరికా బాంబుల వర్షం

**హౌతీలపై దాడిలో 31 మంది మృతి**

వాషింగ్టన్: యెమెన్‌లోని హౌతీలపై అమెరికా విరుచుకుపడింది. బాంబు దాడులతో యెమెన్ రాజధాని సనా, సదా, హౌతీల బలమైన ప్రాంతం అల్‌బేద్, రాడాలపై అమెరికా సేనలు శనివారం బాంబుల వర్షం కురిపించాయి. ఎర్రసముద్రంలో అగ్రరాజ్య నౌకపైకి హౌతీలు దాడికి సమాధానంగా అమెరికా పెద్ద యెత్తున జరిపిన బాంబు దాడుల్లో 31 మంది మరణించగా, 100 మందికి పైగా గాయపడ్డారు. వీరిలో ఎక్కువగా మహిళలు, పిల్లలు ఉన్నారని హౌతీ ఆరోగ్య శాఖ తెలిపింది. బాంబు దాడులతో ఆయా ప్రాంతాలు భూకంపం వచ్చినట్టు కంపించిపోయాయని స్థానికులు తెలిపారు. 'మీ టైం అయిపోయింది. ఈ రోజు నుంచే మీ దాడులను నిలిపివేయండి. అలా చేయకపోతే ఇంతకుముందెన్నడూ చూడని విధంగా నరకాన్ని చవిచూస్తారు' అని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హౌతీలను హెచ్చరించారు. హౌతీ ఉగ్రవాదులకు ప్రధాన మద్దతుదారుగా ఉన్న ఇరాన్‌కు కూడా ట్రంప్ గట్టి హెచ్చరికలు జారీ చేశారు.



## 59 మంది సజీవ దహనం

- 150 మందికిపైగా గాయాలు
- ఉత్తర మాసిడోనియాలోని నైట్‌క్లబ్‌లో అగ్నిప్రమాదం

స్కోప్జె: ఉత్తర మాసిడోనియాలోని కొకని పట్టణంలో ఆదివారం తెల్లవారుజామున భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. ఓ నైట్‌క్లబ్‌లో స్థానిక పాప్ బృందం కచేరీ నిర్వహిస్తుండగా బాణసంచా కారణంగా భవనంపై కప్పుకు మంటలు వ్యాపించాయి. దీంతో కార్యక్రమంలో గందరగోళం నెలకొంది. అగ్ని ప్రమాదం వల్ల భవనం పైకప్పు పాక్షికంగా కూలిపోయింది. ఈ ప్రమాదంలో 59 మంది దుర్మరణం చెందగా, 150 మందికి పైగా గాయపడ్డారు. వారిని వివిధ దవాఖానలకు తరలించి చికిత్స అందిస్తున్నారు. ఘటన జరిగిన భవనం గతంలో కార్పెట్ గోదాముగా ఉండేదని స్థానిక మీడియా పేర్కొంది. నైట్‌క్లబ్‌కు లైసెన్స్ ఉందా? భద్రతా ప్రమాణాలను పాటించారా? అన్న విషయాలపై దర్యాప్తు చేస్తామని హోం శాఖ మంత్రి తొష్కోవ్‌స్కీ తెలిపారు.

## లష్కరే తాయిబా మోస్ట్‌వాంటెడ్ ఉగ్రవాది హతం

ఇస్లామాబాద్: లష్కరే తాయిబా ఉగ్రవాద సంస్థలో జమ్ముకశ్మీరు కార్యకలాపాల చీఫ్ ఘాజీ అబు ఖతాల్ హతమయ్యాడు. పాకిస్థాన్‌లోని పంజాబ్ ప్రావిన్స్‌లో ఇద్దరు గుర్తు తెలియని సాయుధులు అతడిని కాల్చిచంపారు. 2011 ముంబై ఉగ్రదాడుల సూత్రధారి హఫీజ్ సయీద్‌కు ఖతాల్ సన్నిహితుడు. జమ్ముకశ్మీర్‌లో పలు ఉగ్రదాడుల్లో అతడి ప్రమేయం ఉంది. 2023 జనవరి 1న రాజౌరీలోని ధంగ్రి ప్రాంతంలో ఉగ్రవాదులు జరిపిన కాల్పుల్లో ఐదుగురు మరణించారు. ఆ మర్నాడు టైమర్ ఐఈడీ పేలుడులో మరో ఇద్దరు చనిపోయారు.

## ఏఆర్ రెహమాన్‌కు స్వల్ప అస్వస్థత

చెన్నై: ఆస్కార్ విజేత, సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ ఆదివారం డీహైడ్రేషన్‌తో బాధపడ్డారు. ఆయనను ఆదివారం ఉదయం ఓ కార్పొరేట్ దవాఖానలో చేర్పించారు. కొన్ని పరీక్షల అనంతరం ఆయన ఆరోగ్యం సాధారణంగా ఉందని వైద్యులు తెలిపారు. ఆయనను డిశ్చార్జ్ చేశారు. ఈ వివరాలను ఆయన సోదరి రిహానా, మేనేజర్ సెంథిల్ వేలన్ తెలిపారు. ఆయన బ్రిటన్ నుంచి వచ్చారని, విమాన ప్రయాణం వల్ల బడలికగా ఉన్నారని వేలన్ చెప్పారు. ఆయన ఛాతీ నొప్పితో బాధపడినట్లు వచ్చిన వార్తలను రిహానా తోసిపుచ్చారు.

## పాక్ సైనిక కాన్వాయ్‌పై దాడి

- సుమారు 90 మంది సైనికులు మరణించారని బీఎల్ఏ ప్రకటన
- ఐదుగురు చనిపోయినట్టు స్థానిక మీడియా వెల్లడి



కరాచీ: ఇటీవలి రైలు హైజాక్ ఘటన మరువక ముందే పాకిస్థాన్‌లో బలూచ్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్ఏ) మరో దాడికి పాల్పడింది. మిలిటరీ కాన్వాయ్‌పై తాము జరిపిన దాడిలో 90 మంది సైనికులు మరణించారని బీఎల్ఏ ప్రకటించింది. అయితే ఈ దాడిలో ఐదుగురు సైనికులు మరణించారని, 12 మంది గాయపడ్డారని స్థానిక మీడియా పేర్కొంది. భద్రతా దళాలు చేపట్టిన కౌంటర్ ఆపరేషన్‌లో ఒక సూసైడ్ బాంబర్ సహా ఐదుగురు ఉగ్రవాదులు మరణించినట్టు వెల్లడించింది. ఆదివారం క్వెట్టా నుంచి టఫ్తాన్‌కు ఏడు బస్సులు, రెండు ఇతర వాహనాలతో సైనికుల కాన్వాయ్ వెళ్తుండగా, ఐఈడీలతో నిండిన ఉగ్రవాదుల వాహనం ఒక బస్సును ఢీకొంది. అదే సమయంలో ఉగ్రవాదులు వారి కాన్వాయ్‌పై రాకెట్ ప్రొపెల్లెడ్ గ్రనేడ్‌లతో దాడి చేశారు. ఇది ఆత్మాహుతి దాడిగా అనుమానిస్తున్నట్టు పోలీసులు తెలిపారు. డ్రోన్ల ద్వారా ఉగ్రవాదుల కోసం గాలిస్తున్నామని భద్రతా దళాలు తెలిపాయి. కాగా, మిలిటరీ కాన్వాయ్‌పై తాము జరిపిన దాడిలో 90 మంది సైనికులు మరణించారని బీఎల్ఏ ప్రకటించింది. ఆర్మీ ప్రకటించినట్టు కాకుండా, తాము జరిపిన దాడిలో వారికి పూర్తి నష్టం జరిగిందని, ఒక బస్సు పూర్తిగా ధ్వంసమయ్యిందని, వెంటనే తమ బృందం పూర్తిగా ఇంకో బస్‌ను చుట్టుముట్టి వారిని హతమార్చినట్టు బీఎల్ఏ నేత మాజీద్ బ్రిగేడ్ తెలిపారు.



## మంగళూరులో 75 కోట్ల డ్రగ్స్ పట్టివేత

మంగళూరు: కర్ణాటకలో రికార్డు స్థాయిలో మాదకద్రవ్యాలు దొరికాయి. మంగళూరు పోలీసులు 37 కేజీలకుపైగా ఎండీఎంఏను స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ రూ.75 కోట్లు. ఈ కేసులో ఇద్దరు దక్షిణాఫ్రికా జాతీయులను బెంగళూరులో అరెస్టు చేశారు. మంగళూరు పోలీస్ కమిషనర్ అనుపమ్ అగర్వాల్ మీడియా సమావేశంలో మాట్లాడుతూ బెంగళూరులో నైజీరియా జాతీయుడిని గత సెప్టెంబరులో అరెస్ట్ చేశామన్నారు. అతని నుంచి రూ.6 కోట్ల విలువైన డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. లోతుగా దర్యాప్తు చేసినపుడు అంతర్జాతీయ నెట్‌వర్క్ గుట్టు తెలిసిందన్నారు. ఢిల్లీ-బెంగళూరు మధ్య విమానాల్లో ప్రయాణిస్తూ వీరు మాదక ద్రవ్యాలను అక్రమ రవాణా చేస్తున్నారని చెప్పారు.




## ట్రంప్‌పై గ్రీన్‌లాండ్ ప్రజల కన్నెర్ర

**పెద్ద ఎత్తున నిరసన ర్యాలీలు**

నూక్: గ్రీన్‌లాండ్‌ను స్వాధీనం చేసుకుంటామని తరచూ బెదిరింపులకు దిగుతున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై గ్రీన్‌లాండ్‌వాసులు కన్నెర్ర చేశారు. ట్రంప్ తీరుకు వ్యతిరేకంగా గ్రీన్‌లాండ్ పౌరులు, అధికార, విపక్ష నేతలు ఒక్కటయ్యారు. శనివారం గ్రీన్‌లాండ్ రాజధాని నూక్‌లో యూఎస్ దౌత్య కారాల్యయం ఎదురుగా వందలాది మంది ప్లకార్డులు, జెండాలు పట్టుకొని నిరసన ర్యాలీ నిర్వహించారు. త్వరలో ప్రధాని పదవి నుంచి దిగిపోనున్న మ్యూట్ బీ ఇగెడి నిరసన ర్యాలీకి నేతృత్వం వహించగా, ఎన్నికల్లో గెలుపొందిన డెమొక్రటిక్ పార్టీ నాయకుడు జెన్స్ ఫ్రెడరిక్ నీల్సన్ ర్యాలీలో పాల్గొనటం గమనార్హం. వీ ఆర్ నాట్ ఫర్ సేల్, మేక్ అమెరికా గో అవే.. అనే సందేశాల్ని నిరసనకారులు జెండాలపై ప్రదర్శించారు. గ్రీన్‌లాండ్‌లోని ఇతర నగరాల్లోనూ ట్రంప్‌నకు వ్యతిరేకంగా నిరసన ర్యాలీలు కొనసాగాయి. దీనికంటే ముందు శుక్రవారం ట్రంప్ వ్యాఖ్యల్ని ఖండిస్తూ గ్రీన్‌లాండ్ పార్లమెంట్‌లోని ఐదు రాజకీయ పార్టీలు సంయుక్త ప్రకటన ఒకటి విడుదల చేశాయి.



## తమిళ రుపీ చిహ్నాన్ని నిర్మల కూడా వాడారు

- తమిళ నాడు బడ్జెట్‌లో దీని వినియోగం సరైనదే
- సమర్థించుకున్న స్టాలిన్

చెన్నై, మార్చి 16:భాష విషయంలో సడలని వైఖరిని ప్రదర్శించడం కోసమే తాము తమిళ రుపీ చిహ్నాన్ని ఉపయోగించామని తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ చెప్పారు. దీనిపై వివాదం రేపుతున్న వారిని తీవ్రంగా ఎండగట్టారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ కూడా ఈ చిహ్నాన్ని ఉపయోగించారని, ఇంగ్లిష్ 'ఆర్‌ఈ'కి బదులుగా తమిళ 'రు'ను వాడారని గుర్తు చేశారు. రాష్ట్ర 2025-26 బడ్జెట్‌లో అధికారిక రుపీ చిహ్నానికి బదులుగా, తమిళ 'రు' అక్షరాలను వాడటం సరైనదేనని ఎక్స్ పోస్ట్‌లో స్పష్టం చేశారు.

## వీఐపీ ప్రయాణ ఖర్చులు తడిసిమోపెడు

**కర్ణాటకలో రెండేండ్లలో విమాన ప్రయాణాలకు రూ.34 కోట్లు**

బెంగళూరు, మార్చి 16: కాంగ్రెస్ అధికారంలో ఉన్న కర్ణాటకలో వీఐపీల ప్రత్యేక వైమానిక ప్రయాణ చార్జీలు తడిసిమోపెడయ్యాయి. రెండేళ్లకు 34 కోట్ల రూపాయలకు పైగా ఖర్చయినట్టు పబ్లిక్ వర్క్స్ శాఖ వెల్లడించింది. కర్ణాటక లెజిస్లేటివ్ కౌన్సిల్‌లో ఒక ప్రశ్నకు ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఈ ఖర్చులపై వివరణ ఇచ్చారు. 2023-24లో అత్యున్నతస్థాయి అధికారులు, నేతల విమాన ప్రయాణాలకు ప్రభుత్వం 13.38 కోట్లను ఖర్చు చేసిందని, 2024-25 ఏడాదికి అది రూ.21.20 కోట్లకు పెరిగి, రెండేండ్లకు రూ.34.58 కోట్లకు చేరినట్టు వివరించారు. వీరిలో అత్యధిక హెలికాప్టర్ ట్రిప్పులతో సిద్ధరామయ్య మొదటి స్థానంలో ఉన్నారు.